# కారు డ్రైవింగ్

"పాలసముద్రంలో పుట్టిన లక్ష్మిలా వుంది కదండీ" రాజ్యం అంది భర్తతో. తెల్లగా నిగనిగ లాడుతూ గుమ్మంలో ఆగిన దాన్ని చూస్తూ.

"నువ్వు చూశావా! సుధాకర్ నవ్వుతూ అన్నాడు. ఆ... యిలాగే తెల్లగా అందంగా" రాజ్యం చేత్తో ముట్టుకోబోయింది. "అమ్మో మాసిపోతుంది బాబూ! దూరంగా నిలబడి చేతులు చీర కొంగుకు తుడుచుకుంది.

"మమ్మీ నువ్వురా గుడికెళ్ళి పూజచేసి రావాలి.

కొడుకు రవిచంద్ర తొందరచేస్తుంటే రాజ్యం హడావిడిగా బీరువాలోంచి పట్టుచీర తీసి కట్టుకుని, నుదుట ఎర్రని కుంకుమ దిద్దుకొని వచ్చింది.

కారు కొనుక్కున్న సరదాలో పని వున్నా లేకపోయినా స్నేహితుల యిళ్ళకీ, చుట్టాల యిళ్ళకీ వెళ్ళి వస్తున్నారంతా. దగ్గర్లో పనైనా రవిచంద్ర స్కూటర్ మానేసి కారులో వెళ్ళడం ప్రారంభించాడు.

ఆరోజు సాయంత్రం బయటకు వెళ్ళడానికి సిద్ధమైన సుధాకర్ నువ్వు కూడా నాతో రా! అన్నాడు కళ్ళజోడు తుడ్చుకుంటూ. ఆశ్చర్యపోయింద రాజ్యం.

మీతోనా?

అవును

"క్లబ్బుకి మీతో నేనెప్పుడైనా వచ్చానా? ఎప్పుడైనా మీరు నన్ను తీసుకెళ్ళారా!"

ఓ అదా! క్లబ్బులో భోజనం చేశాక ఆటో కోసం బోలెడు దూరం నడిపించడం ఇష్టం లేక. నా భార్యతో క్లబ్బుకెళ్ళడం నాకిష్టమే. అంతేకాదు, భార్యను ఎక్కడికీ తీసుకురాని ఛాదస్తునిగాను, లేకపోతే దుర్మార్గుడిగాననూ అనుకుంటుంటారు కొందరు.

"ఛ!ఛ అవేం మాటలు. అయినా మీరన్నట్లు కాలునొప్పి ఒకటుంది కదానాకు"!

"సరే తయారవ్.త్వరగా, యివ్వాళ క్లబ్‌లో తంబోలా ఆడాలి!

సన్నని షిఫాన్ చీర, ఎర్రని దుద్దులు, పెదాలకు ఎర్రని లిప్‌స్టిక్, చిన్న పూలరుమాలుతో పెదాలు ఒత్తకుంటూ "పదండి అంది" రాజ్యం.

రాజ్యం వంక కంటి రెప్ప వేయకుండా చూస్తున్నాడు సుధాకర్. అరగంట క్రితం జుట్టు ముడేసుకుని, పాత చీర కట్టుకుని కూర తరుక్కుంటున్న రాజ్యమేనా! ఈవిడ. ఇప్పుడెలా ఉన్నావో తెల్సా!..

"అప్పుడున్నట్లు"

"అప్పుడెప్పుడు?"

"అదే ఇరవై యేళ్ళనాడు".

ఓహో... రాజ్యం కిలకిలా నవ్వింది.

ఎర్రని పెదాలు మెరుస్తూ మరీ అందంగా కనిపించింది.

కారు ఇంటికొచ్చి ఆరు నెలలు దాటింది. ఉన్నట్టుండి రాజ్యానికి ఒక ఆలోచన వచ్చింది. తనెందుకు కారు డ్రైవింగ్ నేర్చుకోకూడదూ! వీథిలో కూర్చుని పేపర్ చదువుతున్న సుధాకర్ దగ్గరికి కాఫీ కప్పుతో వచ్చింది రాజ్యం.

ఏవండీ! చెప్పు

"ఒక కోరిక కోరుతున్నా తీర్చాలి"!

సుధాకర్ పేపర్ ఠక్కున క్రింద పడేశాడు.

"కోరికలంటేనే నాకు భయం. అందులో ఆడవాళ్ళ కోరికలు మరీ భయం. అందులోనూ భార్య కోరికలంటే మరీ మరీ భయం!"

"అన్నిటికీ నా మాట తీసిపారేసినట్టు దీన్ని తీసిపారేస్తే ఒప్పుకోను".

సుధాకర్ వెంటనే ఆడవాళ్ళ కోరికలేముంటాయ్. పక్కింటి పిన్నిగారు చేయించుకున్నటువంటి వజ్రాల దిద్దులు, ఎదురింటి వదిన గారు చేయించుకున్నలాంటి చంద్రహారం -

అలా కాకపోతే మీ అన్నయ్య కొనుక్కున్న పెద్ద ఫ్లాటు, మీ బాబాయి కొనుక్కున్న పూరవతల తోట యిలాటివేగా అన్నాడు.'

"యింకా నయం.

అంత పెద్ద కోరికలేం లేవ్'

వినరే ముందు.

కారు డ్రైవింగ్ నేర్చుకుంటా

"కారు డ్రైవింగా! నువ్వా!

ఏ కోరికన్నా తీరుస్తా గానీ ఈ కోరిక తీర్చను.

నువ్వు నేర్చుకోడానికి వీల్లేదంతే"

సుధాకర్ చాలా మొండి మనిషి అని రాజ్యానికి తెలుసు.

అయితే మాత్రం.

సుధాకర్ పేపర్ తీసుకొని లోపలికెళ్ళిపోయాడు.

రాజ్యం మొఖం ఒక్కసారి ఎర్రబడిపోయింది.

తన ఫ్రెండు రాణి ఎన్నేళ్ళుగానో డ్రైవ్ చేస్తోంది.

ఎందుకో అతనికిష్టం లేని పని చెయ్యడానికి వెనుకాడుతుంటాడెందుకో! తను! ఈ జనసమ్మర్ధంలో రిక్షాలు, సైకిళ్ళూ, బళ్ళూ, స్కూటర్లూ పోటీపడి అటూ, ఇటూ పరుగెడుతుంటే తనకీ డ్రైవిగ్ కష్టంగా వుంది.

అయినా తన భార్య సుఖంగా, తనో, కొడుకో కారు డ్రైవించ్ చేస్తుంటే హాయిగా కూర్చోక, ఎందుకీ బాధ. తన

5 రాజ్యానికి చిన్న దెబ్బ తగిలినా తను భరించలేడు- సుధాకర్ మనసులో గట్టిగా అనుకున్నాడు.

ఆ తర్వాత భార్యభర్తల మధ్య కారు నేర్చుకోవడం విషయం మళ్ళా రాలేదు. రెండు నెలలు గడిచాయి. అబ్బాయికి అన్నం వడ్డిస్తూ "రేపటినుంచి డ్రైవింగ్ స్కూల్లో చేరుతున్నా అంది" రాజ్యం.

"నువ్వా! వద్దు మమ్మీ ప్లీజ్"

రాజ్యానికి కోపం వచ్చింది.

"అంటే నేనొట్టి మొద్దునా! నాకే విద్యలూ రావని మీ ఉద్దేశ్యమా!"

ఇంట్లో అన్నం వండటం తప్ప!! అరిచింది రాజ్యం.

ఒంటరిగా కూర్చున్న రాజ్యానికి మనస్సు మరోవిధంగా పని చేసింది. తన కొడుకు, భర్త కూడా, తన క్షేమం కోరుతున్న వాళ్ళే. నువ్వు కష్టపడొద్దని చెప్తుంటే, తనకెందుకీ గొడవ. అంతరంగంలో ఆ భావం కలిగినప్పుడల్లా, అణచివేసుకుంది రాజ్యం.

ఏడాది దాటింది.

కూరలు కొనడానికికెళ్ళి రాజ్యం ఆటో దిగింది. కారుకు తాళం వేసి వస్తున్న పిన్నిగార్ని చూసి విస్తుపోయింది ఆ క్షణాన. పిన్నిగారికి యాభై ఏళ్ళు పైనే వుంటాయి.

"ఏమే రాజ్యం బాగున్నావా! పిన్నిగారే పలకరించింది. బాబాయ్ గారీ మధ్య కొడుకు దగ్గరికి బొంబాయి వెళ్ళారు. వూరికే తోచక డ్రైవింగ్ స్కూల్లో చేరాను. హాయిగా నెలరోజుల్లో వచ్చేసింది.

అవునూ! మీ ఆయన కారు కొన్నట్టు విన్నాను. నువ్వు నేర్చుకున్నావా!లేదా! అంది.

"మా ఆయన, మా అబ్బాయి కూడా నాకు డ్రైవింగ్ రాదని, నేర్చుకొవ్వని గోల చేస్తున్నారు" పిన్నీ అంది. ఇంచు మించుగా ఏడుపు గొంతుతో

"ఏమిటీ!అంటారంటారు.

అసలు ఆడవాళ్ళు ఏమి నేర్చుకుంటామన్నా వద్దనే అంటారు మగవాళ్ళు. పురుషాధిక్యత అంటే యిదే. స్త్రీల అణచి వేత అంటే యిదే. అందుకే వాళ్ళు వద్దన్నవన్నీ మనం ఖచ్చితంగా చేయాలి.

నే వస్తా పద. మీ ఆయనతో మాట్లాడుతా!"

పిన్నిగారు పెద్ద నోరున్న మనిషని, మహాగర్విష్టిఅని, చుట్టాలంతా చెప్పుకోవడం తనకి తెల్సు.

"నా మీద ప్రేమతోనే గదా వద్దంటున్నది. నేనెందుకు కష్టపడాలని అంతే". పిన్నిగారు పకపకా నవ్వింది.

ప్రేమప్రేమ అని కబుర్లు చెప్తూనే ఆడవాళ్ళని నోరెత్తనీయకుండా లొంగదీసుకుంటారమ్మా! నా మాటవిను హాయిగా నేర్చుకో." పిన్నిగారు అటు వెళ్ళిపోగానే రాజ్యం హాయిగా వూపిరి తీసుకుంది.

రాజ్యం కోరిక మనస్సులో రోజు రోజుకీ పెద్దదై వేధిస్తోంది. ఒక నిర్ణయానికొచ్చేసింది రాజ్యం. రోజూ ఓగంట ఇంటికి తాళం వేసి బయటికెళ్తోంది రాజ్యం. కొడుకు, భర్త ఐదు దాటితేగాని ఇంటికి రారు. నెలరోజులు వూరికే గడిచిపోయాయి. వారం రోజులు ఆఫీసు పనిమీద సుధాకర్ మద్రాసు వెళ్ళడం, రవిచంద్ర ఎన్.సి.సి. క్యాంపుకి ఊరు వెళ్ళడం రాజ్యానికి ఉత్సాహాన్ని కల్గించాయి. ఊరునించి వచ్చాక స్టేషన్‌కి కార్లో వెళ్ళి, రిసీవ్ చేసుకుని, భర్తను ఆశ్చర్యపరచాలనుకుంది రాజ్యం. మెల్లిగా కారు బయటకి తీసి దగ్గర దగ్గరకి వెళ్ళొస్తుంది. ఆ రోజు కారు బయటికి తీసి నెమ్మదిగా స్టార్ట్ చేసింది. కొంచెం దూరం వెళ్ళిందో లేదో సైకిల్ మీద స్పీడ్‌గా వస్తున్న కుర్రాడు కారు కింద పడబోయాడు. ఆ ఖంగారులో రాజ్యం కారు ఎదురుగా వున్న ఎలక్ట్రికల్ స్థంభానికి గుద్దుకుంది. ముందు అద్దం పగిలింది. అంతలో జనం పోగయ్యారు. కుర్రాడు సైకిల్ తీసుకెళ్ళి పోయాడు. రాజ్యం కారు వంక చూసింది. ఆ పిల్లాడు క్రింద పడితే అమ్మో! ముఖానికి పట్టిన చెమట తుడుచుకొని, అటూ యిటూ చూసింది రాజ్యం. ఓ ఐదు నిమిషాలయ్యాక తనకు తానే ధైర్యం చెప్పుకుంది. యాక్సిడెంట్లు ఎవరైనా చెయొచ్చు. కారు వర్క్‌షాప్‌లో యిచ్చి రేపు సాయంత్రం తెచ్చి యింట్లో పెట్టేయాలని చెప్పింది. ఆటోలో యింట్లో అడుగు పెట్టిన రాజ్యం గుండె దడ యింకా తగ్గలేదు. సుధాకర్ ఎల్లుండి పొద్దున వస్తాడు. రేపు సాయంత్రం కారు పోర్టికోలో వుంటుంది. తర్వాత సంగతి తర్వాత.

రాజ్యం మనస్సులో ఎందుకో అప్రయత్నంగా పిన్నిగారి మాటలు కదలాడాయి. ఆయన వద్దన్న పని చేస్తే యిలాగే జరుగుతుందేమో. రాజ్యాన్ని కొక్కసారి ఆయన మీద, కొడుకు మీద, కారు మీద, ఆఖరికి పిన్నిగారి మీద కూడా కోపం వచ్చింది.

తెల్లవారిన దగ్గర్నుంచి సాయంత్రం నాలుగు గంటలు ఎప్పుడౌతుందా, కారెప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూనే వుంది రాజ్యం. కాలింగ్ బెల్ మోగడంతో ఉలిక్కిపడి గడియారం వంక చూసింది. టైము మూడు గంటలే. ఓ గంట ముందే

తెచ్చాడన్న మాట కారు. ఉత్సాహంగా తలుపులు తీసిన రాజ్యం ముఖం వెలతెలపోయింది. టూరు ఓ రోజు కాన్సిల్ చేసుకొచ్చాడు సుధాకర్.

"రాజీ!కుమారరత్నం కాలేజీకి కారేసుకెళ్ళాడా!"

వాడు క్యాంపు కెళ్ళాడుగా అంది గబగబా లోపలికెళ్లూ రాజ్యం.

"మరి కారు" మంచి నీళ్ళ గ్లాసు భర్తకందిస్తూ ఖంగారు దాచుకుంటూ,

"మా పిన్ని కూతురికి నిన్న పెళ్ళిచూపులు. పెళ్ళికొడుకుని తీసుకురావడానికి కారు కావాలని బాబాయ్ అడిగితే. రాజ్యం సగం మాట ఆపి. సాయంత్రం తెస్తానన్నాడు తమ్ముడు అంది."

శుభకార్యానికి యివ్వనంటే బాగుండదు కదా అందుకని అంటూ రాజ్యం కాఫీ తయారు చెయ్యడానికి వంటింట్లోకెళ్ళింది. తలుపేసి రెండు నిముషాలు కాలేదు కాలింగ్‌బెల్ మోగింది. బిల్లు సుధాకర్ చేతికందించాడు మెకానిక్ బాయ్. "అమ్మగారు బిల్ తెమ్మన్నారు! కారు యింకో అరగంటలో ఇంటి కొచ్చేస్తుంది.

సరే నువెళ్ళు.

సుధాకర్ చేతిలో బిల్లు కదులుతోంది.

రాజ్యం కాఫీ కప్పు భర్తకందించింది.

కాఫీ కప్పు అందుకుని, మరో చేతిలో వున్న కారు రిపేరు బిల్లు రాజ్యం చేతికందించాడు సుధాకర్.

ఆ తర్వాత ఎప్పుడూ కారు డ్రైవ్‌చేస్తానని రాజ్యం అననూ లేదు, చేయద్దని సుధాకర్ అననూ లేదు.

కాలం వేగంగా పరిగెత్తింది.

రాజ్యం జుట్టు అక్కడక్కడ మెరుస్తోంది. సుధాకర్ ఇక నాలుగేళ్ళలో రిటైర్ అయిపోవడానికి సిద్ధంగా వున్నాడు.

కొడుకు ఇంజనీరింగ్ అయిపోయింది. పెళ్ళి సంబంధం కూడా కుదిరిపోయింది.

తాంబూలాలు పుచ్చుకున్నాక, ఇంట్లో ఎవరూ లేకుండా చూసి కాబోయే కోడలు వీణకి ఫోన్ చేసింది రాజ్యం. చాలాసేపు మాట్లాడాక, ఎంతో ఆనందం ముఖంలో నిండిపోయింది రాజ్యానికి.

రెండు నెలల్లో అనుకున్న ముహూర్తానికి కొడుకు పెళ్ళి జరిగింది.

చుట్టాల సందడి తగ్గింది. ఆరాత్రి కొడుకు, కోడలు, భోజనం చేస్తుంటే దగ్గర కూచుని కబుర్లు చెప్తున్నారు రాజ్యం, సుధాకర్.

"మమ్మీ నీకో విషయం చెప్తా-- నువ్వెంత ఆనందిస్తా వంటే"- రవిచంద్ర ఆగాడు క్షణం.

"చెప్పు త్వరగా" అంది రాజ్యం కోడలువైపు చిరునవ్వుతో చూస్తూ.

"మీ కోడలు ఎంతబాగా కారు డ్రైవ్ చేస్తుందో - అబ్బ. నువ్వు ఆశ్చర్యపోతావ్" రవిచంద్ర మాటలకి నవ్వొచ్చి, పలకమారింది వీణకి.

'అబ్బా, అంత బాగా కారు డ్రైవ్ చేస్తుందా' అంది ఆశ్చర్యంగా రాజ్యం.

అత్తకోడలు కళ్ళతో మాట్లాడుకోటం గమనిస్తున్న సుధాకర్, "అవును, అత్తగారు కాబోయే కోడలిని డ్రైవింగ్ స్కూల్లో చేర్పించి, డబ్బులు కట్టి, నేర్పిస్తే, ఎందుకు బాగా డ్రైవ్ చేయదూ" అన్నాడు వెంటనే. రాజ్యం ముఖం వెలవెల పోయింది.

వీణ, రాజ్యం, సుధాకర్ పకపకా నవ్వుకుంటుంటే, అప్పటికి విషయమర్థమయిన రవిచంద్ర, వాళ్ళతో బాటు కలిసి నవ్వాడు.

రెండు నెలలక్రితం పావుగంట పైగా ఫోన్‌లో కారు డ్రైవింగ్ గురించి కాబోయే కోడలితో తను మాట్లాడినప్పుడు, పక్కగదిలో మరో ఫోన్‌నుంచి అన్నీ భర్త విన్నాడన్న విషయం రాజ్యానికేం తెలుసు పాపం!!!

ఇంటింటి చిత్రాలు - "మూసీ"

- సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక మార్చి-ఏప్రిల్ 2000